వెయ్యేళ్ల గుడి.. ఈ గతి పట్టించారు!



అభివృద్ధి పేరుతో తవ్వి పోగులేశారు

నిధుల కోసమే అని అనుమానాలు



ఆలయంలో విగ్రహాలు

సత్యవేడు/నాగలాపురం, ఆగస్టు 5 : చరిత్ర పట్ల మన నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంలా కనిపిస్తుంది నాగలాపురం మండలం టీపీపాళెంలోని ఈ శ్రీరాజగోపాల స్వామి ఆలయం. గోపురాలపై శిల్పాలు, శిల్పాలు చెక్కిన రాతి స్తంభాలు, సున్నపు మిశ్రమంతో తెల్ల బండలపై నిర్మించిన ఈ ఆలయం వెయ్యేళ్ల కిందటిదని చెబుతారు. క్రీ.శ.1100లో పల్లవరాజులు నిర్మించినట్లు ఆధారాలున్నాయంటారు. ధూపదీప నైవేద్యాలతో ఒకనాడు అలరారిన రాజగోపాలస్వామి ఆలయం మాన్యాలు మాయం కావడంతో ఆదరణ కరువై శిథిల స్థితికి చేరుకుంది. పాతబడిన ఆలయం మనకెందుకు కొత్త ఆలయం నిర్మించుకుందామని 2019లో గ్రామానికి చెందిన వైసీపీ నేత, ప్రస్తుత సర్పంచ్ పళణి ప్రతిపాదన చేశారు. దాతల సహకారంతో తానే కొత్త గుడి నిర్మిస్తానని చెప్పారు.శిథిలావస్థకు చేరిన వాహన గోపురం, ధ్వజస్తంభం, ప్రహారీలకు మరమ్మతులు చేయిస్తానని అనుమతుల కోసం దేవదాయశాఖకు 2019లో విన్నవించుకున్నారు. ఇంకేం.. అధికారంలో ఉన్నది తమ ప్రభుత్వమే కావడంతో ఆగమేఘాల మీద అనుమతులు వచ్చేశాయి. అంతే ఆయన ఆలస్యం చేయకుండా పురాతన ఆలయంలో తవ్వకాలు మొదలు పెట్టేశారు. గోపురాలు కూల్చేశారు. ధ్వజస్తంభం తవ్వి తీసేశారు. కొత్త ఆలయం నిర్మించకపోగా ఉన్న పాత గుడినీ దాదాపుగా కూల్చేసి ఇలా మిగిల్చేశారు.





కూల్చేసినప్పటి ఆలయ పరిస్థితి

గుప్త నిధుల కోసమేనా?

టీపీపాళెంలోని శ్రీరాజగోపాల స్వామి ఆలయంలో గుప్తనిధులను వెలికి తీయడానికే ఇలా కూల్చేశారనే ప్రచారం ఈ ప్రాంతంలో జోరుగా సాగుతోంది. ఆలయ ప్రవేశ ద్వారం నుంచి, గర్భగుడి వరకు ఇష్టారీతిన జరిపిన తవ్వకాలను ఇందుకు సాక్ష్యంగా చూపుతున్నారు. మరమ్మతులకంటూ అనుమతులు పొందిన వారు ఆలయం చుట్టూ 20 అడుగుల ఎత్తు వరకు పరదాలతో కప్పేసి, రాత్రి వేళల్లో ఆలయంలో భారీ యంత్రాలతో తవ్వకాలు ఎందుకు జరపాల్సి వచ్చిందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ధ్వజస్తంభం, బలిపీఠం, గర్భగుడి దగ్గర ముప్పై, నలభై అడుగుల లోతు వరకు తవ్వకాలు ఎందుకు జరపాల్సిన వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. నాలుగేళ్ల కిందట భారీ యంత్రాలతో తవ్వకాలు జరిపినపుడు, ఆ ధాటికి ఆలయ పరిసరాల్లోని నివాస గృహాలు వైబ్రేషన్‌కు గురయ్యాయని చెబుతున్నారు. ఆలయం కూల్చివేత వెనుక అప్పటి అధికార వైసీపీ బడా నేతలు కూడా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. కడప జిల్లాకు చెందిన ఒక వైసీపీ నేత ఆలయంపై కన్నేసి, స్థానిక నేతలతో కలిసి అభివృద్ధి పేరుతో ఆలయంలో తవ్వకాలు జరిపి నిధులు దోచుకున్నారనే వదంతులు కూడా ఈ ప్రాంతంలో వినిపిస్తున్నాయి. అసలు వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని ఆర్కియాలజీ అనుమతి లేకుండా ఎలా కూల్చేశారన్నదే విచిత్రం.మరమ్మతుల పేరుతో అనుమతులిచ్చిన దేవాదాయ శాఖ, ఆలయంలో జరుగుతున్న తవ్వకాలను ఎందుకు పర్యవేక్షించలేదో అర్థం కాదు. కాగా ఈ విషయమై ఆలయ ఈవో లతను వివరణ కోరగా మరమ్మతులకోసం అనుమతులు పొందిన దాత పళణికి నోటీసులిచ్చామని తెలిపారు. ఆరు నెలల్లో ఆలయ పనులు పూర్తి చేయాలని ఆయనకు ఆదేశాలిచ్చామన్నారు. గడువులోగా పనులు పూర్తి కాకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



శిథిలావస్థలో ఆలయం

ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూములపై పునఃపరిశీలన

పారిశ్రామిక, పర్యాటక రంగాలకు ప్రోత్సాహం

కలెక్టర్‌కు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం





అమరావతి సదస్సులో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూములపై పునః పరిశీలన చేయాలని, ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ సంజామల వెంకటేశ్వర్‌కు దిశానిర్దేశం చేశారు.సోమవారం అమరావతిలో అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో నిర్వహించిన సదస్సులో ఆయన జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై సమీక్షించారు. ఇటీవల మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 22ఏనిషేధిత జాబితాలో వున్న అసైన్డ్ భూములను పెద్దఎత్తున ఫ్రీ హోల్డ్ చేయడం, రిజిస్ట్రేషన్లతో ఆ భూములు చేతులు మారిన ఉదంతాలు వెలుగు చూసిన సంగతి తెలిసిందే. ఈ రకమైన వ్యవహారాలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎక్కువగా జరిగినట్టు వెల్లడి కావడంతో సదస్సులో సీఎం చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించారు. జిల్లా వ్యాప్తంగా ఫ్రీహోల్డ్ చేసిన అసైన్డ్ భూములపై పునః పరిశీలన జరపాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. పారిశ్రామిక, పర్యాటక రంగాలు జిల్లా అభివృద్ధికి ప్రధాన వనరులని సీఎం అభిప్రాయపడ్డారు. తిరుపతి జిల్లా చెన్నై-వైజాగ్ ఇండస్ట్రియల్ కారిడార్ పరిధిలోకి చేరినందున పరిశ్రమల అభివృద్ధికి అపారమైన అవకాశాలున్నాయన్నారు.ఆ దిశగా జిల్లాలో పారిశ్రామికవాడలను అభివృద్ధి చేసి, పెట్టుబడులు పెట్టేలా పారిశ్రామికవేత్తలను ఆకర్షించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఇప్పటికే పెద్ద ఎత్తున జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు, పరిశ్రమలు జిల్లాలో వున్నందున కొత్త పరిశ్రమలను జిల్లాకు రప్పించడం పెద్ద కష్టం కాబోదన్నారు. అదే విధంగా పర్యాటక రంగ అభివృద్ధికి కూడా జిల్లాలో అవకాశాలు అధికంగా వున్నాయన్నారు. టెంపుల్, హెరిటేజ్, ఎకో టూరిజంలతో పాటు కొత్తగా జిల్లా పరిధిలోకి సముద్ర తీర ప్రాంతం, పులికాట్ సరస్సు వంటివి చేరినందున బీచ్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్ అభివృద్ధికి కూడా అవకాశమేర్పడిందన్నారు. ఈ వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రణాళికలు, ప్రతిపాదనలు రూపొందించాలని కలెక్టర్‌కు సూచించారు.

బీసీలకు ఆదరణ పనిముట్లు త్వరగా ఇవ్వాలి!

చిత్తూరు సహా పలు జిల్లాల్లో బీసీ చేతివృత్తి పనివారికి ఆదరణ పనిముట్లు ఇవ్వలేదని సీఎం చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో ప్రస్తావించారు. వాటిని లబ్ధిదారులకు త్వరగా అందజేయాలని ఆదేశించారు. 2014-19 నడుమ తమ ప్రభుత్వంలో పలుచోట్ల బీసీ భవన్‌ల నిర్మాణం చేపట్టామని, అయితే ప్రభుత్వం మారడంతో గత ప్రభుత్వం చాలావరకూ వాటిని పూర్తి చేయలేదన్నారు. అలాంటివి గుర్తించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గౌడ, ఈడిగ తదితర కులాలకు చెందిన పలు కుటుంబాలు కల్లు విక్రయించే వృత్తిలో కొనసాగుతున్నాయని గుర్తు చేసిన సీఎం కల్లు, మద్యం షాపుల్లో 15-20 శాతం షాపులు వారికే కేటాయించాల్సి వుందన్నారు. ఉచిత ఇసుక విధానంపై సమీక్షించిన సీఎం చంద్రబాబు రానున్న రోజుల్లో గ్రామ, వార్డు సచివాలయాల నుంచే ఇసుక బుకింగ్ సదుపాయం అందుబాటులోకి తెస్తామన్నారు. ప్రీ పెయిడ్ ట్యాక్సీ తరహాలో ఇసుక రవాణాకు సచివాలయాల్లోనే వాహనాలు బుకింగ్ చేసే సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. ఇంటికి ఇసుక చేరిందని వినియోగదారుడు ధృవీకరించాకే రవాణా రుసుం సంబంధిత ట్రక్కు ఆపరేటర్ల ఖాతాలో జమయ్యేలా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తామన్నారు. ఈ సదస్సులో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యక్షంగా పాల్గొనగా వీడియో కాన్ఫరెన్సు ద్వారా తిరుపతి కలెక్టరేట్ నుంచీ జాయింట్ కలెక్టర్ శుభమ్ బన్సాల్ పాల్గొన్నారు.

జోరు వర్షం



తిలక్ రోడ్డులో ప్రవహిస్తున్న నీళ్లు



కూరగాయల మార్కెట్లో ఇదీ పరిస్థితి



రోడ్లపై నీటి ప్రవాహం

తిరుపతి నగరంలో సోమవారం రాత్రి మంచివర్షం కురిసింది. బంగాళఖాతంలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో పగలంతా ఎండ తీవ్రత కొనసాగింది. రాత్రి దాదాపు గంటపాటు జోరు వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. అండర్ బ్రిడ్జిల్లో నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఆర్టీసీ బస్టాండులో, కూరగాయల మార్కెట్‌లో నీరు నిలవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాతావరణం చల్లబడడంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందారు.

- తిరుపతి అర్బన్



పొక్లయినర్ పడవెక్కింది

పొక్లయినర్ పడవెక్కిదేంటని విస్తుపోతున్నారా.. ఇరకందీవికి వెళ్లాలంటే ఇదొక్కటే దారి మరి..విషయంలోకి వస్తే..తడ మండలంలోని ఈ గ్రామానికి ఏటా వర్షాకాలమొస్తే పొలాల మీదకు ఉప్పుటేరు పోటెత్తుతుంది. రైతులు పంట నష్టపోతుంటారు. ఈ సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ భావించారు. ఉప్పుటేరు కట్టడికి పొర్లుకట్టలు ఏర్పాటు చేయాలని సంకల్పించారు. నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో పొర్లుకట్టల నిర్మాణానికి పొక్లయినర్ అవసరమైంది. సోమవారం భీములవారిపాళెం పడవలరేవు వద్ద నాటు పడవలో పొక్లయినర్‌ని ఎక్కించి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఇరకందీవికి చేర్చారిలా..

- తడ

గత ప్రభుత్వం దగా చేసింది... మా భూములను కబ్జా చేసింది



పట్టాదార్ పాసు పుస్తకాలను చూపుతున్న రౌతు సూరమాల గ్రామస్తులు

తిరుపతి(విద్య), ఆగస్టు 5: 'మా భూములను మాకు తెలియకుండానే లాగేసుకున్నారు... రికార్డుల్లో పేర్లు మార్చేశారు... ఒక్క పైసా కూడా నష్టపరిహారం ఇవ్వలేదు. మా గ్రామ సర్పంచి (వైసీపీ) మాయ మాటలు నమ్మి మోసపోయాం. తీరా ఇప్పుడు చూసుకుంటే... తాత ముత్తాతలనుంచి సాగుచేసుకుంటున్న భూ రికార్డుల్లో మాపేర్లే లేవు. మేమంతా పేద ఎస్సీ ఎస్టీ బీసీ కుటుంబాలకు చెందినవారం... మీరే న్యాయం చేయాలి' అంటూ తొట్టంబేడు మండలం రౌతుసూరమాల గ్రామ ప్రజలు వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వో పెంచల కిషోర్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. రౌతు సూరమాల గ్రామానికి చెందిన నిరుపేదలైన సుమారు 50 ఎస్సీ, ఎస్టీ బీసీ కుటుంబాలకు కలిపి 100 ఎకరాలకు డీకేటీ పట్టాలు మంజూరు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా గతంలో ఇచ్చారు. అయితే ఇండస్ట్రియల్ పార్క్‌కోసం 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం తొట్టంబేడు మండలంలో భూములను సేకరించింది. ఆ సందర్భంగా రైతులకు నష్టపరిహారం చెల్లిస్తూ భూములను టీడీపీ ప్రభుత్వం సేకరించింది. ఆ తరువాత వైసీపీ అధికారంలోకి వచ్చాక నష్ట పరిహారం చెల్లించాకే ప్రభుత్వం భూములను తీసుకుంటుందని రాజకీయ నాయకులు, అధికారులు చెబుతూ రావడంతో రైతులు ధైర్యంగా ఉండిపోయారు. అనుమానం వచ్చి ఇటీవల పరిశీలించుకుంటే భూ రికార్డుల్లో తమ పేర్లే వారికి ఆన్‌లైన్‌లో కనిపించలేదు. వారి భూములన్నీ ఏపీఐఐసీ పేరున ఉన్నట్టు, రైతులు ఆ భూములను ప్రభుత్వానికి అప్పగించినట్టు ఉంది. ఈ విషయమై సర్పంచిని సంప్రదించగా...అధికారులెవరికీ ఫిర్యాదు చేయొద్దని, త్వరలో నష్టపరిహారం వస్తుందని చెప్పినట్టు గ్రామస్తులు డీఆర్వోకు తెలియజేశారు. తమ భూములను తీసుకుంటున్నట్టు వైసీపీ ప్రభుత్వం తమకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదని చెప్పుకొచ్చారు.కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వకుండా... తమకు తెలియకుండా భూములను తీసేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. తామంతా పేదలమని, ప్రభుత్వం ఇచ్చిన ఒకటి, రెండెకరాలే తమకు జీవనాధారమని, వాటిని అక్రమంగా కబ్జాచేసినవారిపై చర్యలు తీసుకుని తమకు నష్టపరిహారం ఇప్పించాలని కోరారు.

ఎంబీసీ వద్ద భక్తులు, సిబ్బంది మధ్య వాగ్వాదం

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వీఐపీ బ్రేక్ టికెట్లు జారీ చేసే ఎంబీసీ34 కౌంటర్ వద్ద భక్తులు, సిబ్బంది మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సాధారణంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అదనపు ఈవో కార్యాలయంలో వీఐపీ బ్రేక్ కోసం సిఫార్సు లేఖలు సమర్పిస్తే రాత్రి 8 గంటలలోపు సెల్‌ఫోన్లకు బ్రేక్ దర్శనం కేటాయించినట్లు మెసేజ్ వస్తుంది. అందులోని లింక్ ద్వారా నగదు చెల్లించిన అనంతరం టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. లేదా ఆ మెసేజ్‌ని ఎంబీసీలో చూపించి నగదు చెల్లిస్తే టికెట్లు అందజేస్తారు. ఇటీవల అదనపు ఈవోగా వెంకయ్య చౌదరి బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో సిఫార్సు లేఖలన్నీ స్వయంగా పరిశీలిస్తూ అర్హత కలిగిన వారికే బ్రేక్ టికెట్లు అందజేస్తున్నారు. దీంతో భక్తుల సెల్‌ఫోన్లకు ఆలస్యంగా మెసేజ్‌లు వెళుతున్నాయి. ఈక్రమంలోనే సోమవారం రాత్రి 9 గంటలైనా మెసేజ్ రాని కొందరు భక్తులు ఎంబీసీలోని సిబ్బందిని ప్రశ్నించారు. కొంతసమయం గందరగోళ పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న అధికారులు వేగవంతమైన చర్యలు తీసుకోవడంతో భక్తులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 75,356 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 21,815 మంది తలనీలాలు సమర్పించారు.

టీటీడీకి రూ.11.22 లక్షల విరాళం

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి చెందిన ట్రస్టుకు సోమవారం రూ.11.22 లక్షలు విరాళంగా అందింది. చంద్రగిరి మండలం, బుచ్చినాయుడు పల్లెకు చెందిన దామరపాటి శంకర్, మురళి ఈ విరాళాన్ని అందజేశారు. విరాళం మొత్తాన్ని డీడీల రూపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. ఇందులో ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10.11 లక్షలు, రూ.1.11 లక్షలు గోసంరక్షణకు వినియోగించాలని దాత కోరారు.

వెంకన్న సేవలో ప్రముఖులు


శ్రీముఖి

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. తమిళనాడు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివజ్ఞానం, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, తెలంగాణ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, నటి శ్రీముఖి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం ఎమ్మెల్యే మురళీమోహన్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం తిరుమలలో సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గడిచిన ఐదేళ్లలో ఆలయాన్ని రాజకీయ కలాపాలకు కేంద్రంగా మార్చారన్నారు. ముఖ్యమైన నాయకుడి వ్యక్తిగత పనుల కోసం టీటీడీలో కీలకంగా ఉన్న అధికారులు వ్యవస్థలను వాడుకున్నారన్నారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి భక్తులకు మంచి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు.

గదుల డిపాజిట్ రీఫండ్‌లో ఇబ్బందులను తొలగించండి: జనసేన


కిరణ్ రాయల్

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): గదుల కోసం భక్తులు ఇస్తున్న డిపాజిట్ రీఫండ్ విషయంలో ఇంకా ఇబ్బందులు ఉన్నాయని తిరుపతి జనసేన ఇన్‌చార్జ్ కిరణ్ రాయల్ అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. గదుల డిపాజిట్ సొమ్ము చాలా మందికి తిరిగి రావడం లేదంటున్నారని, ఆ డబ్బును టీటీడీనే తీసుకుంటోందా అనే భ్రమలో ఉన్నారన్నారు. పూర్వపు విధానమైన క్యాష్ రీఫండ్ విధానాన్నే తిరిగి అమలుచేయాలని కోరారు.

అభివృద్ధి చేసేవారికే పట్టం కట్టండి

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 5: టీటీడీ ఎంప్లాయీస్ బ్యాంకు ఎన్నికల్లో అభివృద్ధి చేసే వారికే పట్టం కట్టాలని టీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ నేతలు గోల్కొండ వెంకటేష్, గుణశేఖర్ పిలుపునిచ్చారు. ప్రెస్‌క్లబ్‌లో వీరు సోమవారం మీడియాతో మాట్లాడారు. సెప్టెంబరు 19న జరిగే ఎన్నికల్లో తమ అభ్యర్థులు పూజారి రత్న ప్రభాకర్, నైనారు పద్మాఖర్, పట్నం దయాకర్‌లను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

న్యాయం చేయండి

తిరుపతి(కపిలతీర్థం),ఆగస్టు 5:'అడవి పందులకోసం పొలాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తుతీగలు తగిలి నారెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీనికి కారకులపై చర్యలుతీసుకుని, న్యాయంచేయండి'అని చిన్నగొట్టిగల్లు మండలం పాలమాకులపల్లెకి చెందిన శారద కోరారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. తాను పశువులు మేపుకునేందుకు పొలాల్లోకి వెళ్లిన సమయంలో అదే గ్రామానికి చెందిన ఉమాశేఖర్ అడవి పందుల కోసం పొలంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలు తగిలి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయని చెప్పింది. కాపాడే ప్రయత్నం చేసిన తన కుమార్తె కాలికి కూడా తీవ్ర గాయమైందని తెలిపింది. ఆస్పత్రిలో వైద్య ఖర్చుల కోసం రూ.5 లక్షల వరకు ఖర్చయిందని చెప్పింది. దీనికి కారకుడైన ఉమాశేఖర్ తనను చంపుతానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే తనకు రక్షణ కల్పించి, నష్టపరిహారం చెల్లించి ఆదుకోకుంటే ఆత్మహత్యకు పాల్పడాల్సి వస్తుందని వాపోయింది. కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరింది.

హైదరాబాదుకెళ్లే ఆర్టీసీ ఏసీ బస్సు టిక్కెట్‌లో 20శాతం రాయితీ

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 5: ఆర్టీసీ మంగళం డిపోకు చెందిన అమరావతి ఏసీ సర్వీసులోని టిక్కెట్‌లో 20శాతం రాయితీ కల్పిస్తున్నట్లు డీఎం భాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు రోజూ రాత్రి సెంట్రల్ బస్సు స్టేషన్ నుంచి బయల్దేరి కడప, కర్నూలు మీదుగా హైదరాబాదు చేరుకుంటుందన్నారు.ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సర్టిఫికెట్ల పంపిణీ

తిరుపతిరూరల్, ఆగస్టు 5:మహిళల్లో నైపుణ్యాల పెంపునకు శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని బీజేపీనేత భానుప్రకాశ్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో శ్రీటెక్నాలజీ, మాస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన విశ్వకర్మ శిక్షణ పూర్తి చేసినవారికి సోమవారం యూత్‌హాస్టల్‌లో సర్టిఫికెట్ల పంపిణీ చేశారు. టీడీపీనేత వెంకటప్రసాద్, నెహ్రూయువకేంద్ర గణాంక అధికారి బాబురెడ్డిలతో మాస్ అధ్యక్షుడు జ్ఞానశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

సామిరెడ్డి ఒడ్డు చెరువు కట్టపై వ్యర్థాలు

వాహనాల రాకపోకలకు అంతరాయం


సామిరెడ్డి ఒడ్డు చెరువుకట్టపై పోసిన భవన నిర్మాణ వ్యర్థాలు, చెరువుకట్టపై రోడ్డుకిరువైపులా వేసిన పేడ దిబ్బలు

పాకాల, ఆగస్టు 5: మండలంలోని ఇరంగారిపల్లె పంచాయతీ పరిధిలోని అడుసుపల్లె దళితవాడ సమీపంలో వున్న సామిరెడ్డి ఒడ్డు చెరువు కట్టపై భవన నిర్మాణ వ్యర్థాలను ట్రాక్టర్లతో తీసుకొచ్చి డంప్ చేస్తున్నారు. చెరువు కట్టపై ఉన్న రోడ్డుకు ఈ కుప్పలు అడ్డంగా ఉంటున్నాయి. పాకాల - తోటపల్లె వరకు వున్న ఈ రోడ్డు జాతీయ రహదారికి అనుసంధానమవుతోంది. అడుసుపల్లె, కుందేటిపల్లె, జయదేవపురం, సామిరెడ్డిపల్లె, తోటపల్లె, బైనపల్లె పరిసర గ్రామాల ప్రజలు నిత్యం ఈ చెరువుకట్టను ఆనుకొని ఉన్న రోడ్డుపై రాకపోకలు సాగిస్తుంటారు. భవన వ్యర్థాలతో పాటు పేడ దిబ్బలు వేయడంతో రోడ్డు ఇరుకైపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు, భారీ వాహనాలు వెళ్లే సమయంలో ఎదురుగా వాహనం వస్తే సైడ్ ఇవ్వడానికి ముప్పుతిప్పలు పడుతున్నారు. చెరువు మరోవైపు స్థలంలో నివాస గృహాలు నిర్మిస్తూ కొద్ది కొద్దిగా పూడ్చుకుంటూ ఆక్రమించుకుంటున్నారు. చెరువుకు వర్షపు నీరు వచ్చే కాలువ ఇప్పటికే 70 శాతం మేర ఆక్రమణకు గురైంది. మిగిలిన కాలువ మురుగునీటి కాలువగా మారిపోయింది. భవిష్యత్తులో చెరువు కనుమరుగయ్యే ప్రమాదం వుంది. ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్పందించి చెరువులో ఆక్రమణలు తొలగించి, వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టి, చెరువును పరిరక్షించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

భక్తుల నుంచి బంగారు ఆభరణాల అపహరణ

నాలుగు గంటల్లోనే నిందితురాలి పట్టివేత


స్వాధీనం చేసుకున్న నగలతో సీఐ విజయ్‌కుమార్

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భక్తుల నుంచి బంగారు ఆభరణాలను అపహరించిన ఓ మహిళను పోలీసులు నాలుగు గంటల వ్యవధిలోనే పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన మల్లీశ్వరి, నందేశ్వరుడు ఇటీవల తిరుపతిలో కాపురముంటున్న కుమార్తె వద్దకు వచ్చారు. కుమార్తె, అల్లుడు పనిపై వెళ్లిన క్రమంలో వారు తిరుమలకు వచ్చారు. ఇంట్లో భద్రత ఉండదనే కారణంతో తమతో పాటు 230 గ్రాముల బంగారు ఆభరణాలను కూడా తిరుమలకు తీసుకువచ్చారు. అఖిలాండం వద్ద సేదదీరుతున్న క్రమంలో ఓ మహిళ వచ్చి పర్స్‌జిప్ ఓపెన్ చేసి బంగారు ఆభరణాలున్న బాక్స్‌ను అపహరించుకెళ్లింది. కొంతసమయానికి గుర్తించిన మల్లీశ్వరి వెంటనే విజిలెన్స్ అధికారులు, సిబ్బంది సహకారంతో కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని అఖిలాండం ఫుటేజ్‌ను పరిశీలించారు. మహిళ చోరీ చేసినట్టు స్పష్టంగా తెలిసింది. పోలీసులు తిరుమల మొత్తం గాలించి, కర్ణాటక సత్రాల వద్ద ఆ మహిళను అదుపులోకి తీసుకుని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మహిళ అనంతపురానికి చెందిన జింకల తలగా పోలీసులు గుర్తించారు. గతంలో కూడా ఆమె పలు నేరాలకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

12 దుంగలు, రెండు బైక్‌ల స్వాధీనం


స్మగ్లర్ల వివరాలు తెలియజేస్తున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

మంగళం, ఆగస్టు 5: నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి.. 12 దుంగలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి, తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనలతో ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ టీమ్ స్థానిక అటవీశాఖ అధికారుల సాయంతో సోమవారం ఉదయం వెంకటగిరి ఫారెస్టు రేంజ్‌కి వెళ్లి డక్కిలి అటవీప్రాంతం వైపు, సీసీ కండ్రిగ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున వెంకటగిరి హిల్స్ వద్ద రెండు బైక్‌లపై కొందరు వ్యక్తులు కనిపించారు. వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వీరిని వెంకటగిరి మండలానికి చెందిన వెంకటేష్(44), పారవోలు పెంచలయ్య(42), త్రిపురాంతపల్లి వెంకటేష్(44), రేణిగుంట మండలానికి చెందిన కొల్లంగుంట సురేష్‌బాబు(39)గా గుర్తించారు. విచారించి, వారు దాచి ఉంచిన 12ఎర్రచందనం దుంగలను, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పరారైన మిగిలినవారి కోసం గాలిస్తున్నారు. స్మగ్లర్లను తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు ప్రభుత్వ బంజరు భూములు పంపిణీ చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామీణ పేదల సంఘం సభ్యులు

పాకాల, ఆగస్టు 5: భూమిలేని గ్రామీణ పేదలకు ప్రభుత్వ బంజరు భూములను పంపిణీ చేయాలని గ్రామీణ పేదల సంఘం మండల కన్వీనర్ ఎం.ప్రభాకర్, కార్యదర్శి జి.భాస్కర్ కోరారు. గ్రామీణ పేదల సంఘం ఆధ్వర్యంలో గానుగపెంట, పెద్దరామాపురం, మద్దినాయనిపల్లె పంచాయతీల పరిధిలోని సంఘం సభ్యులు సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తహశీల్దార్ నిత్యానందబాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మండలంలోని చిన్నపాపయ్యగారిపల్లె, ధనూజవారిపల్లె, కూనపల్లె, ఎస్సీ కాలనీ, శ్రీరామాపురం, వీరిశెట్టివారిపల్లె, లక్ష్మీపురం, పెద్దరామాపురం, చిగరపల్లె ఎస్సీ, ఎస్టీ కాలనీలలో, మద్దినాయనిపల్లె పంచాయతీ యనమలవారిపల్లె, కాపుపల్లె, హరిజనవాడ, ఓబులశెట్టివారిపల్లె, అయ్యావారిపల్లె, కొత్తపల్లె గ్రామాలలో పేదలు రోజువారి కూలీలుగా జీవనం సాగిస్తున్నారని చెప్పారు. సాగుకు అనుకూలంగా వున్న ప్రభుత్వ బంజరు భూములను వీరికి పంపిణీ చేసి వ్యవసాయం చేసుకునేలా ప్రోత్సాహించాలన్నారు. గానుగపెంట పంచాయతీ పరిధిలోని చిన్నపాపయ్యగారిపల్లె నుంచి పనపాకం వరకు వున్న అడవి బాటను ఫారెస్ట్ అధికారులు మూసివేశారని, దీంతో పశువులు, మూగజీవాల మేతకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఈ బాటను పునరుద్ధరించాలని కోరారు. అర్హులైన పేదలకు స్థలాలతో పాటు ఇళ్లను కూడా ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని కోరారు.

తల్లిపాలే బిడ్డకు ఔషధం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 5: తల్లిపాలే బిడ్డకు ఔషధమని రుయా సూపరింటెండెంట్ రవిప్రభ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం రుయా చిన్నపిల్లల విభాగంలో నిర్వహించిన తల్లిపాల అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ప్రొఫెసర్లు కిరీటి తదితరులు పాల్గొన్నారు. ● అంకురా ఆస్పత్రిలో జరిగిన కార్యక్రమంలో ఎండీ డాక్టర్ వంశీకృష్ణ, ప్రముఖ గైనకాలజిస్టు రేష్మారెడ్డి పాల్గొన్నారు. ఎలాంటి ఆహారం తీసుకోవాలనే విషయాలపై ఆస్పత్రిలోని తల్లులకు, గర్భిణులకు అవగాహన కల్పించారు.

మహిళ ఆత్మహత్య


భారతి మృతదేహం

తిరుచానూరు, ఆగస్టు 5: తిరుపతి రూరల్ మండలం దామినేడు హౌసింగ్ కాలనీలో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దామినేడు హౌసింగ్‌కాలనీలో బ్లాక్ నెంబరు 5లో భారతి(30) కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె ఓ హోటల్‌లో కార్మికురాలిగా పనిచేస్తోంది. స్థానికులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

వేలం పాటల్లో రూ.24.12లక్షల ఆదాయం


వేలంపాట నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

పాకాల, ఆగస్టు 5: పాకాల పంచాయతీ కార్యాలయ ఆవరణలో సోమవారం సర్పంచ్ ఎస్.కస్తూరి అధ్యక్షతన వారపు సంత, దినసరి మార్కెట్, ప్రైవేట్ బస్టాండ్, జంతువధశాలకు బహిరంగవేలం పాట నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి రుసుములు వసూలు చేసుకోవడానికి గుత్తేదారులు వారపుసంతను రూ.15,55,000కు, దినసరి మార్కెట్‌ను రూ.7,25,000కు, ప్రైవేట్ బస్టాండును రూ.90,000కు, జంతు వధశాలను రూ.42,000కు పాడుకున్నారు. ఈ వేలం పాటల్లో పంచాయతీకి రూ.14.12లక్షలు ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వి.బి.మాలతి, పంచాయతీ కార్యదర్శి మోతీ, సిబ్బంది తులసీరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో హేతుబద్ధీకరణ జరగాలి


సమావేశంలో పాల్గొన్న ఎస్టీయూ నాయకులు

రామచంద్రాపురం, ఆగస్టు 5: ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ జిల్లా స్థాయిలో జరగాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. పరమాల ఉన్నత పాఠశాల వద్ద సోమవారం సమస్యల సేకరణ, సభ్యత్వ స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ రాష్ట్రస్థాయిలో కాకుండా జిల్లా విద్యాశాఖాధికారుల సమక్షంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. ప్రధాన కార్యదర్శి జగన్నాథం మాట్లాడుతూ ఏపీజీఎల్ఐ మెచ్యూరిటీ క్లెయిమ్‌లు, రుణాలనగదు, జడ్‌పీపీఎఫ్ నాన్ రిఫండబుల్, రిఫండబుల్ రుణాలు నగదు వంటివి వెంటనే ఆయా ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వాసు, వరప్రసాద్, జగన్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యకు మంచి భవిష్యత్తు

రామచంద్రాపురం, ఆగస్టు 5: రాబోయే రోజుల్లో ఫార్మా రంగానికి స్వర్ణయుగంగా చెప్పుకోవచ్చని, అందుచేతనే ఫార్మసీ డిగ్రీని విదేశాల్లో ఉన్నత విద్యనందించే రెడిమేడ్ పాస్‌పోర్టుగా ప్రొఫెసర్ రూప్ క్రిషన్ ఖర్ అభివర్ణించారు. మండలంలోని వెంకట్రామపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఫార్మసీ వృత్తిలో స్పెషలైజేషన్ కోసం అవకాశాలు అనే అంశంపై కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఎస్ అనంగ్‌పురియా ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్, ఫరీదాబాద్ డైరెక్టర్ ప్రొఫెసర్ రూప్ క్రిషన్ ఖర్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. సాంప్రదాయక కోర్సులకు ఉద్యోగ అవకాశాలు సన్నగిల్లుతున్న సమయంలో చాలా మంది ప్రత్యామ్నాయం కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వారికి ఫార్మసీ డిగ్రీ ఆశాజ్యోతి అని చెప్పవచ్చన్నారు. ప్రిన్సిపాల్ నిరంజన్‌బాబు మాట్లాడుతూ మనిషి మనుగడ ఉన్నంతకాలం, అనారోగ్యాలు వెన్నాడుతున్నంత కాలం ఫార్మసీ రంగానికి మాంద్యం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సుమలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవిత్ర హోటల్లో తనిఖీలు



చంద్రగిరి, ఆగస్టు 5: చంద్రగిరిలోని పవిత్ర హోటల్లో తిరుపతి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి సోమవారం సాయంత్రం తనిఖీలు చేశారు. ఇటీవల హోటల్లో సురేష్ అనే వ్యక్తి భోంచేస్తుండ గా బొద్దింక కన్పించిన నేపథ్యంలో ఈ తనిఖీలు చేశారు. హోటల్లో ఆహార పదార్థాలను పరిశీలించాక, చికెన్ బిర్యానీని పరీక్షల నిమిత్తం తీసుకున్నారు.

జనబాహుళ్యంలోకి సంస్కృత విజ్ఞానం

సిద్ధాంత సంస్థతో ఎన్ఎస్‌యూ చర్చలు

తిరుపతి రూరల్, ఆగస్టు 5: సంస్కృత విజ్ఞానాన్ని అధునాతన టెక్నాలజీ ద్వారా జన బాహుళ్యంలోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్ఎస్‌యూ)తో చెన్నైకి చెందిన సిద్ధాంత నాలెడ్జ్ ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం అవగాహన చర్చలు జరిపారు. వర్సిటీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ఇతర అధికారులతో కలిసి సిద్ధాంత సంస్థ ఛైర్మన్ జయకృష్ణ, శాస్త్రవేత్తలు సుదర్శన్, లక్ష్మి, ఆత్రేయ సత్యనారాయణ, మేనేజర్ రాంబాబు పాల్గొన్నారు. వైదిక కృషి విజ్ఞానం, ప్రాచీనపాకశాస్త్రం, గణితం, సంస్కృత వినోదం, ప్రశ్నాశాస్త్రం, సిద్ధాంత జ్యోతిషం అంశాలపై చర్చించి, రానున్న రోజుల్లో వీటిపై ఎంవోయూ చేసుకోవాలని నిర్ణయించారు. రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ, అధ్యాపకులు కేఎస్ సతీశ, గణపతిభట్, శంకర్‌నారాయణ, సూర్యనారాయణ, చంద్రశేఖరం, పీఆర్వో ఓపీజీ కళ్యాణశాస్త్రి, ఏపీఆర్వో కె.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూలో ఆర్చరీ శిక్షణ ప్రారంభం


క్రీడాకారులతో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి రూరల్, ఆగస్టు 5: పటిష్ఠ శరీరంతోపాటు మానసికాభివృద్ధికి క్రీడలు మరింతగా దోహదం చేస్తాయని జాతీయ సంస్కృత వర్సిటీ (ఎన్ఎస్‌యూ) వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి తెలిపారు. వర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్చరీ శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించి, ప్రసంగించారు. త్వరలోనే వర్సిటీలో ఆర్చరీ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అకడమిక్ డీన్ ఆఫ్ అఫైర్స్ రజనీకాంత్ శుక్లా, చీఫ్ వార్డెన్ వెంకట్రావు, క్రీడా కార్యదర్శి వి.సేతురామ్, ఆర్చరీ కోచ్ ధనంజయ, సాంబశివరావు, గిరికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డలకు వ్యాధినిరోధక శక్తి


మాట్లాడుతున్న డాక్టర్ శశికళ

చంద్రగిరి, ఆగస్టు 5: తల్లిపాలతోనే బిడ్డలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని గ్రామీణ ఆరోగ్య శిక్షణ కేంద్రం హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శశికళ అన్నారు. సోమవారం చంద్రగిరిలోని నూకలగుంటలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గర్భిణులు, బాలింతలకు, తల్లులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి తల్లి ప్రసవమైన గంటలోపు ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలే బిడ్డకి మొదటి టీకా అని చెప్పారు. ఈకార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ టాటాబాయి, సూపర్‌వైజర్ నారాయణరాజు, ఏఎన్ఎంలు గిరిజ, శశిరేఖ, వెలుగు సీసీ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను త్వరగా పరిష్కరించాలి : డీఆర్వో

కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్ఎస్'కు 201 అర్జీలు



అర్జీదారుడితో మాట్లాడుతున్న పెంచలకిషోర్

తిరుపతి(విద్య), ఆగస్టు 5: సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను డీఆర్వో పెంచలకిషోర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 201 అర్జీలు వచ్చాయి. వీటిల్లో రెవెన్యూ శాఖకు అత్యధికంగా 130 ఉన్నాయి. డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రామ్మోహన్, నరసింహులు, కోదండరామిరెడ్డి తదితరులు జనం నుంచి అర్జీలను స్వీకరించారు.

దివ్యాంగులు, వృద్ధులకు ప్రాధాన్యం : ఏఎస్పీలు



బాధితులతో మాట్లాడుతున్న వెంకట్రావు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 5: ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో దివ్యాంగులు, వృద్ధులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఏఎస్పీ వెంకట్రావు, విమలకుమారి అన్నారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు మొత్తం 85 అర్జీలు అందాయి. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



విజేతలతో ముఖ్య అతిథులు, టీచర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 5: పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని నారాయణ కళాశాల కెమెస్ట్రీ అధ్యాపకుడు చిట్టిబాబు చెప్పారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేలా 'పరివర్తన్ ప్రభావ్' పేరుతో ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ కరకంబాడి అమర రాజా విద్యాలయంలో సోమవారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన చిట్టిబాబు మాట్లాడుతూ.. మన సౌకర్యాలకోసం ప్రకృతిని నాశనం చేయకూడదని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అమర రాజా సంస్థల ఐటీ హెడ్ కె.కృష్ణ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 12పాఠశాలలకు చెందిన విద్యార్థులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు.కార్యక్రమంలో అమరరాజా మొబిలిటీ సీనియర్ మేనేజర్ బాల సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు గ్లోరీ దేవప్రియ, టీచర్లు పాల్గొన్నారు.

మా భూములపై రుణాలూ తీసుకోలేకున్నాం

తిరుపతి(కపిలతీర్థం), ఆగస్టు 5: కష్టకాలంలో తమ భూములపై రుణాలు కూడా తీసుకోలేకున్నామని ఎస్వీ ఆటోనగర్ అసోసియేషన్ సభ్యులు శివప్రసాద్‌రెడ్డి, మల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. ఏపీఐఐసీ ద్వారా 32.7 ఎకరాల భూముల్లో 350 ప్లాట్లు వేసి తమకు కేటాయించారన్నారు. ఈ భూముల్లో తాము షెడ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ భూములను 2017లో ప్రభుత్వం 22ఏ కింద నిషేధిత భూముల జాబితాలో చేర్చిందన్నారు. అప్పటి నుంచి రుణాలు మంజూరు కావడం లేదన్నారు.అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని.. జిల్లా అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. వెంకటేశ్వరరావు, బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హమ్మయ్య.. పీజీఆర్ఎస్‌కు దూరంగా కార్పొరేటర్లు

ప్రజల నుంచి 59 అర్జీలు



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు క్యూకట్టే కార్పొరేటర్లు సోమవారం మాత్రం కనిపించలేదు. దీంతో అధికార యంత్రాంగంతోపాటు సాధారణ ప్రజలు హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకున్నారు. గతవారం 'కార్పొరేటర్లూ.. కామన్‌మ్యాన్‌కి అవకాశమివ్వండి' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై కార్పొరేటర్లలో మార్పు కనిపించింది. సోమవారం కాకుండా మరెప్పుడైనా వచ్చి సమస్యలు తెలియజేయవచ్చని కార్పొరేటర్లకు కమిషనర్ మౌర్య కూడా సూచించినట్టు తెలిసింది. ప్రజలనుంచి మొత్తం 59అర్జీలందాయి. ప్రధానంగా టీడీఆర్ బాండ్లు ఇవ్వాలని, గృహాల కోసం నగదు చెల్లించినా ఇంకా మంజూరు కాలేదని, రోడ్లు.. గుంతలు పూడ్చాలని, కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. వీటన్నింటినీ త్వరగా పరిష్కరించాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, సెక్రటరీ రాధిక, డీఈలు విజయకుమార్ రెడ్డి, సంజయ్‌కుమార్, నరేంద్ర, మహేష్‌రాజు, శ్రావణి, ఆర్వోలు సేతుమాధవ్, కేఎల్ వర్మ, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, ఏసీపీ బాల సుబ్రహ్మణ్యం, మేనేజర్ చిట్టిబాబు, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి పాల్గొన్నారు. కాగా, సోమవారం తెల్లవారుజాము నుంచి ఇంజనీరింగ్ అధికారులతో కలసి న్యూమారుతీ నగర్, ఎంఆర్‌పల్లె పంచాయతీ కార్యాలయం, ఈఎస్ఐ ఆస్పత్రి, స్విమ్స్ సర్కిల్ వద్ద పునఃప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్న అన్నక్యాంటీన్లను కమిషనర్ పరిశీలించారు. కాలువల్లో చెత్త, సిల్టు లేకుండా తొలగించాలని ఆదేశించారు.

ఎస్వీయూలో తరగతుల తనిఖీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 5: ఎస్వీయూలోని పలు విభాగాల్లో తరగతుల నిర్వహణను ఇన్‌చార్జి వీసీ అప్పారావు తనిఖీ చేశారు. హ్యూమనిటీస్ బ్లాక్‌లోని ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతం తదితర విభాగాలను సోమవారం పరిశీలించారు. విద్యార్థులందరూ కచ్చితంగా తరగతులకు హాజరయ్యేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.

క్రీడా పోటీలు ప్రారంభం

ఎస్వీయూ ఫౌండేషన్ డే సందర్భంగా నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘం క్రీడా పోటీలు చేపట్టింది. తారకరామ స్టేడియంలో ఈ పోటీలను ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభించారు. కాసేపు ఉద్యోగులతో కలిసి వారు క్రికెట్ ఆడారు. నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుర్రంకొండ శ్రీధర్, ఎన్.సుబ్రమణ్యం, ఉపాధ్యక్షులు కోటగారం మురళి, జాయింట్ సెక్రెటరీ ముత్తువేలు, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ అదనపు ఈవోను కలిసిన కూటమి నేతలు



తిరుపతి, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో పాటు కూటమి నేతలు సోమవారం తిరుమలలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ సీనియర్ నేత మందలపు మోహన రావు ఈసందర్భంగా వెంకయ్య చౌదరిని శాలువాతో సత్కరించారు. అదనపు ఈవోను కలిసినవారిలో తుడా మాజీ ఛైర్మన్ ఎన్వీ ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ తదితరులు ఉన్నారు.

ఇంటర్‌మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణం చేపట్టండి

● పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి డిమాండు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 5: ఇంటర్ మోడల్ బస్‌స్టేషన్ నిర్మాణ చర్యలు సత్వరమే ప్రారంభించాలని పార్లమెంటులో ఎంపీ గురుమూర్తి డిమాండు చేశారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం ప్రపంచం నలుమూలల నుంచి రోజూ తిరుపతికి లక్షలాదిగా భక్తులు వస్తుంటారని సభ దృష్టికి తీసుకెళ్లారు. తిరుపతి నగరం ఆధ్యాత్మికంగానే కాకుండా విద్య, వైద్యానికి నిలయమన్నారు. ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. అందువల్ల తిరుపతి బస్టాండును అత్యాధునిక హంగులతో నిర్మించేందుకు నమూనాలు సిద్ధమయ్యాయన్నారు. నూతన బస్ టర్మినల్‌తో వచ్చే మూడు దశాబ్దాలకు ప్రయాణికుల రద్దీ, ట్రాఫిక్ ఒత్తిడికి పరిష్కారం లభిస్తుందన్నారు. దీనిపై కేంద్రం దృష్టిసారించాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 5: ఎస్వీయూ ఎకనమిక్స్ పరిశోధకుడు టి.మహేంద్రకుమార్ డాక్టరేట్ పొందారు. 1991 నుంచి 2005 మధ్య కాలంలో భారత్-చైనా ఆర్థిక సంబంధాలు అంశంపై ప్రొఫెసర్ వూకా రమేష్‌బాబు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.



రాజకీయ వేధింపులు అరికట్టాలి : సీఐటీయూ



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

తిరుపతి(విద్య), ఆగస్టు 5: చిరుద్యోగులపై రాజకీయ వేధింపులను అరికట్టాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథక కార్మికులు, అంగన్వాడీ, ఆశా వర్కర్లు పెద్ద ఎత్తున ఈ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.బాలసుబ్రహ్మణ్యం, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడారు. రాజకీయ వేధింపులకు తాము వ్యతిరేకమని సీఎం, డిప్యూటీ సీఎం పదేపదే చెప్తున్నారని, క్షేత్రస్థాయిలో పరిస్థితి అలా లేదని ఆరోపించారు. ఇలాగే కొనసాగితే పోరాటాలు చేస్తామంటూ డీఆర్వో పెంచలకిషోర్‌కు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ప్రసాదరావు, జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, పుల్లయ్య, జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, వెంకటేష్, గురవయ్య, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

రూరల్‌లో 'బెల్టు' తీసేదెవరో..?

ప్రభుత్వం మారినా దందా కొనసాగుతోందన్న విమర్శలు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 5: తిరుపతి రూరల్ సెబ్ పరిధిలో బెల్టు షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మారినా ఈ దందా కొనసాగడంపై విమర్శలొస్తున్నాయి. రూరల్ పరిధిలోని అవిలాల, రేణిగుంట, తనపల్లె, కరకంబాడి, తిరుచానూరు, తూకివాకం, ముళ్లపూడి తదితర ప్రాంతాల్లో బెల్టుషాపుల నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకుని.. కొందరు అధికారులు సహకరిస్తున్నారన్న ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో షాపు నుంచి విక్రయాలను బట్టి నెలకు రూ.5,000 నుంచి రూ.10,000 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వసూళ్ల కోసమే వైసీపీతో అంటకాగిన ఓ హెడ్ కానిస్టేబుల్ పనిచేస్తున్నట్లు సమాచారం. ఇతడిపై ఇదివరకే చంద్రగిరికి చెందిన ప్రజాప్రతినిధి ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ఉన్నారు. ఇకనైనా బెల్టుషాపులకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

ట్రాన్స్‌ఫార్మర్లతో వాటిల్లే నష్టాలను తగ్గించండి

● షిఫ్ట్ ఆపరేటర్లకు డీఈఈల సూచన



తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 5: ట్రాన్స్‌ఫార్మర్లతో సంస్థకు వాటిల్లే నష్టాలను తగ్గించాల్సిన బాధ్యత షిఫ్ట్ ఆపరేటర్లపై ఉందని తిరుపతి టౌన్ డీఈఈలు మునిప్రసాద్, కె.బాబు, మోహన్ సూచించారు. మాధవనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో సోమవారం మంగళం సెక్షన్ పరిధిలోని షిఫ్ట్ ఆపరేటర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ట్రాన్స్‌ఫార్మర్లు విఫలం కాకుండా, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సబ్‌స్టేషన్లలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు. ఏఈలు అమర్‌బాబు, మహేశ్వర్ రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలనగర్ సమస్యలు పరిష్కరించండి

మంగళం, ఆగస్టు 5: మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మిని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోవిందరాజులు కోరారు. సోమవారం కొత్తగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు భాగ్యలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీలో గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకుని ప్రజల ప్రయోజనాల కోసం ఉపయోగించాలని కోరారు. టీడీపీ నాయకులు లంకిపల్లి డిల్లీబాబు, తుడా క్వార్టర్స్ వార్డు మెంబర్ వల్లేరు రాధాకృష్ణ, నాయకులు గల్లా సుధాకర్, దామోదర్ నాయుడు, విజయ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్ అర్బన్ తహసీల్దారు భాగ్యలక్ష్మిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి



భువన్‌కుమార్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మిత్రబృందం

తిరుపతి (జీవకోన), ఆగస్టు5: తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంకు మాజీ డైరెక్టర్, టీడీపీ నాయకుడు భువన్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మిత్రులు, సన్నిహితులు సోమవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీవారి ఆశీస్సులతో భువన్‌కుమార్‌రెడ్డి మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. చంద్రారెడ్డి, రమేష్‌రెడ్డి, చిన్న, ప్రసన్నకుమార్, మహేష్, ఖాదర్, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇసుక రీచ్‌లు దగ్గరలో ఏర్పాటు చేయాని ధర్నా



గూడూరు, ఆగస్టు 5: దూరప్రాంతాల నుంచి ఇసుక తీసుకురావాలంటే అదనపు భారం పడుతోందని సీఐటీయూ పేర్కొంది. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఈమేరకు ధర్నా చేసింది. అంతకుముందు ప్రదర్శన నిర్వహించింది. ఈ సందర్భంగా సీటూ నాయకులు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల కడుపుకొట్టిందన్నారు. గూడూరు పరిసర ప్రాంతాల్లో ఇసుక లేకపోవడంతో అదనపు భారం పడుతోందన్నారు. నియోజకవర్గ పరిధిలో ఇసుక క్వారీలను ఏర్పాటు చేస్తే సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఉచితంగా ఇవ్వాలని ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసులు, శంకరయ్య, శివకుమార్, మధు, రఫీ, కృష్ణయ్య, నాగేంద్ర, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్, చంద్రయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ



గూడూరు అర్బన్, ఆగస్టు 5: స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్ వీల్‌క్లబ్, ఆంధ్రమహిళా మండలి సహకారంతో దివ్యాంగులకు నిత్యావసరాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిణి మాట్లాడుతూ ప్రతినెల దివ్యాంగులకు చేయూతనందించేలా ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. డాక్టర్ తనూజ, స్నేహలత, శశిరేఖ, లక్ష్మీ, సుధీర్, శ్రీధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసాచారి పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పెళ్లకూరు, ఆగస్టు 5 : చావాలి పంచాయతీలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను ఎంపీడీవో అన్నపూర్ణరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధిహామీ పనులను కల్పించాలని సిబ్బందికి సూచించారు. పంచాయతీ పరిధిలోని అన్నీ గ్రామాల్లో కూలీల సంఖ్య పెంచాలని.. పనుల కల్పనలో వెనుకబడిన ఫీల్డ్ అసిస్టెంట్‌లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పనులు చేసే ప్రాంతంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరాతీశారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ భాస్కర్ తదితరులు ఉన్నారు.

స్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి



ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు, ఆగస్టు 5: రెండో పట్టణ పరిధిలో ముస్లింల స్మశానవాటికకు స్థలాన్ని కేటాయించాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ ఇందిరమ్మకాలనీ, గాంధీనగర్, జగనన్నకాలనీ, టిడ్కోగృహాల్లో సుమారు 500 మంది కుటుంబాలు నివసిస్తున్నారన్నారు. దహనసంస్కారాలు చేసుకునేందుకు 4 కిలోమీటర్ల దూరం తీసుకువెళ్లాల్సివస్తుందన్నారు. కాలేషా, ప్రభాకర్, సీవీఆర్‌కుమార్, శశికుమార్, చంద్రయ్య, శుభాన్, నజీర్, జిలానీ పాల్గొన్నారు.

తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గూడూరు అర్బన్, ఆగస్టు 5: తల్లిపాలు బిడ్డకు పరిపూర్ణ ఆరోగ్యవంతమని అంగన్‌వాడీ కార్యకర్తలు అన్నారు. సోమవారం స్థానిక రెండో పట్టణ పరిధిలోని సీతమ్మ పాఠశాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముర్రుపాలు చిన్నారులలో వ్యాధినిరోధక శక్తిని పెంచుతాయన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు ఇస్తే బిడ్డలు ఆరోగ్యంగా ఎదుగుతారన్నారు. కార్యక్రమంలో రాజేశ్వరి, సునీత, రమాదేవి, సుభాషిణి, హైమావతి, సురేఖ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం: నెలవల



రమేష్‌ను సన్మానిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట, ఆగస్టు 5 : రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. టీడీపీ విజయం సాధించిన నేపథ్యంలో సైకిల్‌యాత్ర ద్వారా విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి వెళ్తున్న చిత్తూరుకు చెందిన రమేష్‌ను సోమవారం ఆయన పార్టీ కార్యాలయం వద్ద సన్మానించారు. ఈ సందర్భంగా నెలవల మాట్లాడుతూ రమేష్‌ను ఆదర్శంగా తీసుకొని ప్రతి కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. టీడీపీ నాయకులు నాగేంద్రరెడ్డి, రాజారెడ్డి, ధనంజయరెడ్డి, విజయకుమార్‌నాయుడు, గోపాల్‌రెడ్డి, చక్రపాణి, బాబు, కన్నెమ్మ తదితరులు ఉన్నారు.

కష్టించి పనిచేసిన వారికి జనసేనలో ప్రాధాన్యం

నాయుడుపేట, ఆగస్టు 5 : జనసేనలో ఆరంభం నుంచి కష్టపడిన నాయకులు, కార్యకర్తలకు సముచితస్థానం లభిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ సోమవారం మీడియాకు చెప్పారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు నామినేటెడ్ పదవులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఏ కూటమిలో భాగస్వాములైన జనసేనకు నామినేటెడ్ పదవులు వారి అర్హత ప్రకారం దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు. పార్టీ కార్యక్రమాలు, సంబంధించిన ఫోటోలు, వ్యక్తిగత సమాచారంతో నాయుడుపేటలోని కార్యాలయంలో అందజేయాలన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిట్టమూరు, ఆగస్టు 5 : ప్రభుత్వం పశువుల మినీ గోకులాల ఏర్పాటుకు యూనిట్లు మంజూరు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సురేంద్రబాబు తెలిపారు. చిట్టమూరుకు 9, మల్లాం 8, గునపాడు 8 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. రెండు, నాలుగు, ఆరు పశువుల మినీ గోకులాలకు యూనిట్లు మంజూరు చేస్తున్నామన్నారు. ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్య రేఖకు దిగువనున్న వారు, మహిళలు, అంగవైకల్యమున్నవారు, భూ సంస్కరణల లబ్ధిదారులు, చిన్న, సన్నకారు రైతులు యూనిట్ల ఏర్పాటుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్‌కార్డు, ఉపాధి జాబ్‌కార్డు, స్థలం హక్కు పత్రం, బ్యాంక్ పాస్ బుక్ పత్రాలను జతపరచాలని వివరించారు.

భక్తుల బంగారు ఆభరణాల అపహరణ

● నాలుగు గంటల్లోనే నిందితురాలి పట్టివేత

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): భక్తుల నుంచి బంగారు ఆభరణాలను అపహరించిన ఓ మహిళను పోలీసులు పట్టుకున్నారు. వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్ వివరాల మేరకు.. నెల్లూరుకు చెందిన మల్లీశ్వరి, నందేశ్వరుడు తిరుపతి కుమార్తె వద్దకు వచ్చారు. కుమార్తె, అల్లుడు పనిపై వెళ్లిన క్రమంలో వారు తిరుమలకు వచ్చారు. ఇంట్లో భద్రత ఉండదనే కారణంతో 230 గ్రాముల బంగారు ఆభరణాలను తిరుమలకు తీసుకువచ్చారు. అఖిలాండం వద్ద సేదతీరుతుండగా ఓ మహిళ బంగారు ఆభరణాల బాక్స్‌ను అపహరించుకెళ్లింది. కొంతసమయానికి గుర్తించిన మల్లీశ్వరి వెంటనే విజిలెన్స్ అధికారులు, సిబ్బంది సహకారంతో కమాండ్ కంట్రోల్ రూమ్‌కు చేరుకుని అఖిలాండం ఫుటేజ్‌ను పరిశీలించారు. మహిళ చోరీ చేసినట్టు స్పష్టంగా తెలిసింది. కర్ణాటక సత్రాల వద్ద ఆ మహిళను అదుపులోకి తీసుకుని ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

10న మెగా జాబ్‌మేళా



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ మురుగదాస్

గూడూరు, ఆగస్టు 5: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 10న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురుగదాస్ అన్నారు. సోమవారం స్థానిక కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో పలు ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయన్నారు. 7వ తరగతి నుంచి బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ వరకూ ఉత్తీర్ణులైన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. వివరాలను 9248748405, 9248748428 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.వేణుమాధవ్, సురేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరి, ఆగస్టు 5: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మిగిలిన సీట్ల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. సంస్థ ప్రిన్సిపల్ ఉమారాణి ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రాఫ్ట్‌మన్ సివిల్, ఫిట్టర్, మెషినిష్ట్, వైర్మెన్, మెకానిక్, వెల్డర్ ట్రేడ్లలో చేరేందుకు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఇన్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులు అర్హులన్నారు. ఏడాది కోర్సులో చేరేందుకు 10వ తరగతి ఫెయిలైన వారు కూడా అర్హులేనన్నారు. నమోదు చేసుకొన్న అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నంబరుతో పాటు ఒరిజినల్ సర్టిఫికేట్లు(టెన్త్ మార్కుల లిస్ట్, ట్రాన్సఫర్, సడీ, క్యాస్ట్, ఇన్‌కం, 10వ తరగతి హాల్ టికెట్, ఆధార్‌కార్డు) రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను ఐటీఐ పనివేళల్లో ఈనెల 26లోపు వెరిఫికేషన్ చేయించుకోవాలని తెలిపారు. వివరాలకు 9441850595 ఫోన్ నంబర్లో సంప్రదించాలన్నారు.

108 వాహనానికి తప్పిన ప్రమాదం



వీల్ బోల్ట్ వదిలేయడంలో ఆగిన వాహనం

సూళ్లూరుపేట, ఆగస్టు 5: 108 వాహనానికి ప్రమాదం తప్పింది. సోమవారం కొండూరు వద్ద పెట్రోల్ బంకులో డీజిల్ నింపుకొని ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు వెళ్తుండగా వినాయకుడి గుడి వద్ద వీల్ బోల్ట్ వదిలేసింది. దీంతో వాహనం ఆగిపోయింది. ఒకసారిగా శబ్దం వచ్చి ముందుకు ఒరిగిపోవడంతో డ్రైవర్ అప్రమత్తమై వాహనాన్ని నిలిపివేయంతో ప్రమాదం తప్పింది. నెమ్మదిగా నడపడం వల్ల నియంత్రణ సాధ్యమైంది. అత్యవసర సమయంలో రోగులను తీసుకెళ్లేటప్పుడు ఇలాంటి సంఘటన జరిగితే చాలా ఇబ్బందులెదురయ్యేవి. ఇక్కడి 108 వాహనం తరచూ మరమ్మతులకు గురవుతుందని సిబ్బంది చెబుతున్నారు. 2016లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన వాహనమిది.

ఏడేళ్ల చిన్నారిపై లైంగిక దాడియత్నం

● నిందితుడ్ని పోలీసులకు అప్పగించిన స్థానికులు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 5 : ఏడేళ్ల చిన్నారిపై లైంగికదాడి యత్నానికి పాల్పడ్డాడో యువకుడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలో సోమవారం ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ చిన్నారిపై స్థానిక యువకుడు లైంగిక దాడికి యత్నించాడు. చిన్నారి కేకలు వేయడంతో పక్కింటివారు చేరుకున్నారు. ఈలోగా ఆ యువకుడు వెళ్లిపోయాడు. కొంతసేపటి తరువాత అదే ప్రాంతంలో ఆ యువకుడు తిరుగుతుండడాన్ని స్థానికులు గుర్తించారు. పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసులకు అప్పగించారు. ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి చేరుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. పది రోజులుగా తమబిడ్డను ఆ యువకుడు వేధిస్తున్నట్లు బాధిత బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొంది. నిందితుడిపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

72 మద్యం బాటిళ్ల పట్టివేత



పట్టుబడ్డ మద్యం బాటీళ్లతో సెబ్ సీఐ అరుణకుమారి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 5 : అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ అరుణ కుమారి తెలిపారు. పట్టణంలోని పాత బస్టాండ్‌కు సమీపంలో సోమవారం సాయంత్రం మోటారు సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా 72 మద్యం బాటీళ్లను తరలిస్తుండగా గుర్తించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకొని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

మూడు వాహనాల దగ్ధం



దొరవారిసత్రం, ఆగస్టు 5 : పోలిరెడ్డిపాళెం గ్రామంలో మస్తాన్ ఇంట్లో ఆదివారం రాత్రి మూడు మోటారు సైకిళ్లను గుర్తు తెలియని వ్యక్తి దగ్ధం చేశాడు. కాలిపోయిన వాహనాల్లో బైక్, రెండు స్కూటీలు ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

ఐటీఐ మూడో విడత అడ్మిషన్లకు దరఖాస్తులు

కోట, ఆగస్టు 5 : చిట్టేడు బాలికల ఐటీఐలో మూడవ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అద్దంకి నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో ఈనెల 26లోగా దరఖాను చేసుకుని సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. బ్రాంచిల వారీగా ఎలక్ట్రానిక్ మెకానిక్ 3, మెకానిక్ డీజిల్ 2, వెల్డర్ 7 వంతున ఖాళీలున్నాయన్నారు. మరిన్ని వివరాలకు 8008583423 - 8498066674 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పులికాట్‌కు మంచి రోజులు

● పర్యాటక శోభ దిశగా అడుగులు
● కలెక్టర్ సమీక్షతో ఆశల చిగురింత



అట్టకానితిప్ప వద్ద పర్యావరణ విజ్ఞాన కేంద్రం

సూళ్లూరుపేట, ఆగస్టు 5: కూటమి ప్రభుత్వ సారథ్యంలో నియోజకవర్గంలో పర్యాటక రంగానికి పూర్వ వైభవం రానుంది. రెండురోజుల క్రితం కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించడంతో ఆశలు చిగురించాయి. పులికాట్ ముఖద్వారాల పూడికతీత, పర్యాటక రంగ అభివృద్ధి, తీర ప్రాంత రహదారులు, మౌలిక వసతుల కల్పన లాంటి అంశాలను ఆయన చర్చించారు. ఈదిశగా అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇప్పటికే పులికాట్ ముఖద్వారాల పూడికతీతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.97.09 కోట్లు సాగరమాల నుంచి నిధులు సమకూర్చాయి. తాజాగా ముఖద్వారాల పూడికతీతపై కదలిక రావడంతో మత్స్యకారుల కుటుంబాలు ఆనందం వ్యక్తంచేస్తున్నాయి.

పూడికతీతతో పూర్వవైభవం

వలస పక్షుల విహార కేంద్రంగా విశేష చరిత్ర ఉన్న పులికాట్ సరస్సులో ఒకప్పుడు ఏడాది పొడవునా నీరుండేది. ఏటా శీతాకాలంలో 117 రకాల విదేశీ పక్షులు వలస వచ్చి వెళ్తుంటాయి. దొరవారిసత్రం వద్ద నేలపట్టులో ఇవి విడిది చేస్తుంటాయి. సరస్సుకు, సముద్రానికి మధ్య కొండూరుపాలెం, రాయదొరువు సమీప ముఖద్వారాల వద్ద ఇసుక మేటలు పేరుకుపోయాయి. దీంతో సముద్రపు నీరు సరస్సుకు రావడం లేదు. ఈక్రమంలో వలస పక్షుల సంఖ్య కూడా ఏటా తగ్గిపోతోంది. ముఖద్వారాల పూడికతోనే సరస్సుకు పూర్వ కళ వస్తుంది.

ఆగిపోయిన పక్షుల పండుగ

పులికాట్‌లోకి వలస పక్షులు రావడంతో టీడీపీ ప్రభుత్వం 2001లో పక్షుల పండుగను ప్రారంభానికి శ్రీకారం చుట్టింది. దీంతో ఈ ప్రాంతానికి అప్పటి మంచి గుర్తింపు వచ్చింది. నిధులు మంజూరు చేసి అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్కసారి మాత్రమే ఈ పండగ నిర్వహించి చేతులెత్తేసింది. కూటమి ప్రభుత్వం రావడంతో పర్యాటకరంగానికి మళ్లీ ఊపిరి పోస్తుందని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

పెద్దిరెడ్డి కుటుంబం.. జగన్ జైలుకు వెళ్లడం ఖాయం

పుంగనూరు పర్యటనలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

పుంగనూరు, ఆగస్టు 5: 'మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిలపై మా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడదు. పోలీసు, అధికార వ్యవస్థలను అడ్డం పెట్టుకుని లూటీ చేసిన వైసీపీ నాయకులకు రాజ్యాంగబద్ధంగా కోర్టుల ద్వారా శిక్ష తప్పదు. ఏడాది కిందట పుంగనూరులో టీడీపీ కార్యకర్తలు, ప్రజలను అన్యాయంగా జైలుకు పంపిన పెద్దిరెడ్డి కుటుంబం.. అదే జైళ్లకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలి' అని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి చెప్పారు. చిత్తూరు జిల్లా పుంగనూరులోని జడ్పీ అతిథి గృహంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన మాట్లాడారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో పుంగనూరు ప్రజలు, దీపావళి, సంక్రాంతి, ఉగాది పండుగలన్నీ ఒకేసారి జరుపుకుంటున్నట్లు ఆనందంగా ఉన్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పెద్దిరెడ్డి కుటుంబం వల్ల దగా పడిన ప్రజలు, రైతులు, వ్యాపారులకు తమ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందని హామీ ఇచ్చారు. పోలీసులను, అధికార వ్యవస్థలను అడ్డం పెట్టుకొని ప్రజల మాన ప్రాణాలు, ఆస్తులను దోచుకున్న పెద్దిరెడ్డి కుటుంబం ప్రస్తుతం ఏమయ్యారని ప్రశ్నించారు. కాంట్రాక్టులు, మిషనరీ, గుండాలు ప్రస్తుతం ఎక్కడికి వెళ్లారన్నారు.తాను, పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి ఉదయం 9 గంటల నుంచి నియోజకవర్గంలో పర్యటిస్తుండగా వేలాది మంది స్వాగతం పలుకుతూ పెద్దిరెడ్డి అరాచకాలను ఏకరువు పెట్టారన్నారు. సోమల మండలంలోని చిన్నదైన సీతమ్మ చెరువును 4.5 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌గా చేసి ప్రజాధనాన్ని లూటీ చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. అక్కడి ప్రజల పొలాలను లాక్కొని రైతులను మోసం చేసిన పెద్దిరెడ్డి ముందుగా ప్రజలకు క్షమాపణ చెప్పాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి డిమాండు చేశారు. పెద్దిరెడ్డి త్వరలోనే తిరుపతి నుంచి హైదరాబాదుకు మకాం మారుస్తాడని జోస్యం చెప్పారు. కాగా, ఆవులపల్లె సమీపంలోని సీతమ్మచెరువు వద్ద వందలాది మంది రైతులు తమకు ప్రాజెక్ట్ వద్దు గతంలో ఉన్న చెరువు మాత్రమే ఉండాలని.. తమ భూములు తమకు ఇప్పించాలని అక్కడికి వచ్చిన మంత్రిని కోరారు.

పద్ధతులు మార్చుకోకపోతే చర్యలు : ఎమ్మెల్యే విజయశ్రీ



అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడుతున్న విజయశ్రీ

తడ, ఆగస్టు 5 : గతంలో మాదిరి కాకుండా నిబంధనల ప్రకారం పనిచేయకుంటే చర్యలు తప్పవని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అంగన్‌వాడీ సిబ్బందిని హెచ్చరించారు. సోమవారం ఉదయం చేనిగుంటలోని అంగన్‌వాడీ పాఠశాలను, స్థానిక ఐటీఐ కళాశాలను ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. 10 మంది చిన్నారులు హాజరైనట్లుగా పట్టికలో నమోదుచేసి ఉండగా అందుకు భిన్నంగా ఏడుగురే ఉన్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాలామృత బస్తాలను ఎలుకలు కొట్టివేసినా ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌కు ఫోన్‌చేశారు. అంగన్‌వాడీ పాఠశాల భవనం శ్లాబు పెచ్చులూడిపోతున్నా పట్టించుకోకపోవడం తగదన్నారు. గత ప్రభుత్వంలో పనిచేసిన విధంగా పనిచేయాలనుకుంటే కుదరదన్నారు. ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఫిర్యాదులు అందడంతో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలిస్తున్నామన్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్తవి నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు ఐటీఐ కళాశాలలో సౌకర్యాలపై ఆరాతీశారు. ఎమ్మెల్యేతోపాటు ఎంపీడీవో విజయ్‌కుమార్, హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, బొమ్మన పళణి, శ్రీకాంత్‌రెడ్డి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. సైడ్ కాలువలు నిర్మించాలని గ్రామస్థులు విజయశ్రీని కోరారు.

నలుగురు 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్టు

● 12 దుంగలు, రెండు బైక్‌ల స్వాధీనం



మంగళం, ఆగస్టు 5: నలుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసి.. 12 దుంగలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆర్ఐ చిరంజీవులుకు చెందిన ఆర్ఎస్ఐ నరేష్ టీమ్ స్థానిక అటవీశాఖ అధికారుల సాయంతో సోమవారం వెంకటగిరి ఫారెస్టు రేంజ్ డక్కిలి అటవీప్రాంతం వైపు, సీసీ కండ్రిగ వద్ద ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లను తనిఖీలు నిర్వహించారు. తెల్లవారుజామున వెంకటగిరి హిల్స్ వద్ద రెండు బైక్‌లపై కొందరు వ్యక్తులు కనిపించారు. వారిని చుట్టుముట్టగా పారిపోయే ప్రయత్నం చేశారు. వెంబడించి నలుగురిని పట్టుకున్నారు. వెంకటగిరి మండలానికి చెందిన వెంకటేష్(44), పారవోలు పెంచలయ్య(42), త్రిపురాంతపల్లి వెంకటేష్(44), రేణిగుంట మండలానికి చెందిన కొల్లంగుంట సురేష్‌బాబు(39)గా గుర్తించారు. విచారించి, వారు దాచి ఉంచిన 12ఎర్రచందనం దుంగలను, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. పరారైనవారి కోసం గాలిస్తున్నారు. .

తల్లిపాల వారోత్సవాల ర్యాలీ



కోట, ఆగస్టు 5 : చిట్టేడు, కోట పట్టణ పరిధిలోని రవినగర్ గిరిజన కాలనీలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. సీడీపీవో మునికుమారి, సూపర్ వైజర్లు కవిత, కృష్ణమ్మల ఆధ్వర్యంలో తల్లిపాల విశిష్టతను తెలుపుతూ గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు డాక్టర్ నాగరాజు, హెల్త్ సూపర్ వైజర్ ఎలిజిబెత్, ఏఎన్ఎం శైలజ, విజయలక్ష్మి, మమత, లక్ష్మీ, సుందరమ్మ, పెంచలమ్మ పాల్గొన్నారు.

బైకుతో గేదెను ఢీకొట్టి వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో మురళి మృతదేహం

దొరవారిసత్రం,ఆగస్టు 5: మానేరి వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై బైకుతో గేదెను ఢీ కొట్టి మదనంబేటి మురళి(38) అనే వ్యక్తి మృతి చెందాడు. సింగనాలత్తూరుకు చెందిన ఇతడు మాంబట్టు సెజ్‌లోని అపాచీ కంపెనీలో పనిచేసేవాడు. సోమవారం రాత్రి డ్యూటీ ముగించుకుని బైకుపై స్వగ్రామం వస్తున్నాడు. మానేరి వచ్చేసరికి పొలం నుంచి ఓ గేదె అడ్డుగా వచ్చింది. దీంతో చీకటిలో గేదెను ఢీ కొట్టాడు. మురళి కిందపడి మురళి అక్కడికక్కడే మృతి చెందాడు. గేదె కూడా ప్రాణాలు కోల్పోయింది. పోలీసులు మురళి మృతదేహాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు అభినందన



కోట, ఆగస్టు 5 : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నావల్ ఎన్‌సీసీ క్యాడెట్లను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జునరెడ్డిలు షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు. గత నెల 18 నుంచి 29వ తేదీ వరకు ముంబయిలో జాతీయస్థాయి క్యాంప్ జరిగింది. ఇంజనీరింగ్ విద్యార్థులు ఎం. దుర్గాభవానీ, వి. భానుప్రకాష్‌లు పాల్గొని ప్రతిభాపాటవాలు కనబరిచారని డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఒకరి అరెస్ట్

చిల్లకూరు, ఆగస్టు 5: చిత్తవరం కొత్తపాళెంకు చెందిన టీడీపీ కార్యకర్త గోపాల్‌పై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో వంశీకృష్ణ అనే వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో క్రియాశీలకంగా వ్యవహరించాడని అక్కసుతో మే 14న గోపాల్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేశారు. హత్యాయత్నానికి పాల్పడిన ఈ సంఘటనకు సంబంధించి విష్ణువర్ధన్‌రెడ్డి, కాంత్రికుమార్, దిలీప్‌కుమార్, చెంచయ్యలపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేశారు. వారని అరెస్ట్ చేశారు. తాజాగా వంశీకృష్ణకు కూడా సంబంధం ఉన్నట్లు గుర్తించి సోమవారం అరెస్ట్ చేశారు.

మాజీ ఎంపీ నెలవలకు సత్కారం

పెళ్లకూరు, ఆగస్టు 5 : నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యాన్ని మొదలియార్ సంఘం నాయకులు సోమవారం సత్కరించారు. సంఘం జిల్లా నేతలు కందమూడి శివకుమార్, కందమూడి పళని తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.


శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు

తిరుమల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.90 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది.

టీటీడీకి రూ.11.22 లక్షల విరాళం

టీటీడీకి చెందిన ట్రస్టుకు సోమవారం రూ.11.22 లక్షలు విరాళంగా అందింది. చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లెకు చెందిన దామరపాటి శంకర్, మురళి ఈ విరాళాన్ని అందజేశారు.

సర్పంచ్ చొరవతో ఎల్‌ఈడీ వెలుగులు



జీలపాటూరులో రాత్రి వేళ ఎల్‌ఈడీ కాంతులు

పెళ్లకూరు, ఆగస్టు 5 : ఓ సర్పంచ్ సొంత నిధులు వెచ్చించి గ్రామంలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పంచాయతీలకు పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో అభివృద్ధి పడకేసింది. ఈ క్రమంలో జీలపాటూరు సర్పంచ్ కందమూడి శివకుమార్ ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిన పంచాయతీ నిధులపై పలు పోరాటాలు చేశారు. ఇటీవల ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో పంచాయతీ అభివృద్ధిపై ఆశలు చిగురించాయి. కూటమి ప్రభుత్వంపై విశ్వాసంతో శివకుమార్ తమ పంచాయతీలో నిధులు లేకపోయినా సొంతంగానే కొన్ని పనులు మొదలు పెట్టారు. జీలపాటూరు నుంచి చిల్లకూరు వరకు గల 1.5 కిలోమీటర్ల మేర విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయించారు. వీటికి ఎల్‌ఈడీ లైట్లు కూడా అమర్చించారు. జీలపాటూరుతో పాటు దళితవాడ, దొడ్లవారిమిట్ట, గిరిజన కాలనీల్లో సుమారు 400 ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేయించారు. ఎల్‌ఈడీ కాంతులు విరాజల్లుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

దివ్యాంగ పిల్లలకు శ్రీవారి ఆశీస్సులు మెండుగా ఉండాలి


రేణిగుంట రైల్వేస్టేషన్‌లో దివ్యాంగులకు స్వాగతం పలుకుతున్న తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ

రేణిగుంట, ఆగస్టు 5: దివ్యాంగ పిల్లలకు శ్రీవారి ఆశీస్సులు మెండుగా ఉండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. సోమవారం రోటరీక్లబ్, చెన్నైలోని టీటీడీ ఆలయ సలహా కమిటీ ఆధ్వర్యంలో శ్రీవారి దర్శనార్థం చెన్నై నుంచి రేణిగుంట రైల్వేస్టేషన్‌కు చేరుకున్న 1,008మంది దివ్యాంగ పిల్లలకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు స్వాగతం పలికారు. వారిని తిరుమలకు తరలించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులను ఎమ్మెల్యే జెండా ఊపి పంపారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు మహావీర్ బొత్ర, పంకజ్, శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి కోట వినుత, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, చంద్రబాబు, రాజారెడ్డి, సుధాకర్, బాబ్జి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో టైర్ల దుకాణం దగ్ధం


దగ్ధమవుతున్న టైర్ల దుకాణం

శ్రీకాళహస్తి, ఆగస్టు 5: అగ్ని ప్రమాదంలో సైకిళ్ల టైర్ల దుకాణం దగ్ధమైన ఘటన సోమవారం బీపీ అగ్రహారం కూడలిలో జరిగింది. శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన రాజేంద్రప్రసాద్ బీపీ అగ్రహారం కూడలిలో సైకిళ్ల టైర్ల దుకాణం నిర్వహిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం షార్ట్‌సర్క్యూట్‌తో దుకాణంలో మంటలు చెలరేగాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. సుమారు రూ.2లక్షల ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

శ్రీకాళహస్తి, ఆగస్టు 5: పట్టణంలోని అన్న క్యాంటీన్లను పురపాలక సంఘ కమిషనర్ రమేష్‌బాబు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆర్టీసీ బస్టాండు, రామసేతు సమీపంలో ఉన్న అన్న క్యాంటీన్లకు మరమ్మతులు చేపట్టామన్నారు. క్యాంటీన్లలో గచ్చు వేయడం, అద్దాలు, కిటికీలు, స్టాండ్లు, కుర్చీలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 15న అన్న క్యాంటీన్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

ముక్కంటి ఆలయంలో ఈవో తనిఖీలు


రాహుకేతు పూజా మండపంలో తనిఖీలు చేస్తున్న ఈవో మూర్తి

శ్రీకాళహస్తి, ఆగస్టు 5: శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి తనిఖీలు చేపట్టారు. మొదట రాహుకేతు పూజా మండపంలో పూజా విధానాన్ని పరిశీలించారు. భక్తుల వద్ద ఎలాంటి డబ్బులు వసూలు చేయరాదని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్లు లగేజీ సెంటర్, సెల్‌ఫోన్ కౌంటర్లలను తనిఖీ చేశారు. భక్తులకు ఇచ్చే రసీదులను పరిశీలించారు. భక్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు కృష్ణారెడ్డి, లోకేష్‌రెడ్డి, నాగభూషణం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

రేణిగుంట, ఆగస్టు 5: రేణిగుంట మండలం కరకంబాడిలోని ఓ ఏటీఎంలో దొంగల ముఠా చోరీకి విఫలయత్నం చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల తెలిపిన వివరాల మేరకు.... కరకంబాడి నుంచి తిరుపతికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఓ ప్రైవేటు ఏటీఎంను తెరిచేందుకు శనివారం అర్ధరాత్రి దొంగలు ప్రయత్నించగా సాధ్యంకాలేదు. దీంతో అదే రోడ్డులోని టీ, ఫ్యాన్సీ, స్వీట్స్ షాప్స్, మరో రెండు దుకాణాల్లో చోరీకి పాల్పడ్డారు. బాధితులు రేణిగుంట అర్బన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఉచితంగా మొక్కల పంపిణీ

వరదయ్యపాళెం, ఆగస్టు 5: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రధాని మోదీ ప్రారంభించిన అమ్మ పేరుతో ఒక్క మొక్క కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ జిల్లా యువమోర్చా కార్యదర్శి దిలీప్‌రాయ్ ఉచితంగా మొక్కలు పంపిణీ చేశారు. వేప, నేరేడు, మద్ది, మందార మొక్కలు పంపిణీ చేస్తున్నామని, కావాల్సిన వారు 9494428669 నెంబరును సంప్రదించాలన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

సేలం యువకుడి ఆత్మహత్య

రేణిగుంట, ఆగస్టు 5: ప్రేమించిన అమ్మాయికి పెళ్లి నిశ్చయం కావడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి రేణిగుంటలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రం సేలం ప్రాంతానికి చెందిన వసంతకుమార్(26) విమానాశ్రయ సమీపంలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేసేవాడు. స్థానిక పాంచాలినగర్‌లో తోటి ఉద్యోగులతో కలిసి ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. సేలంలో వసంతకుమార్ ప్రేమించిన యువతికి పెళ్లి నిశ్చితార్థం జరగడంతో మనస్తాపానికి గురయ్యాడు. విధులు ముగించుకుని రాత్రి గదికి చేరుకున్న వసంతకుమార్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తోటి ఉద్యోగులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసులో నలుగురికి జరిమానా

పిచ్చాటూరు, ఆగస్టు 5: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురి పుత్తూరు కోర్టు రూ.10 వేల చొప్పున జరిమానా విధించినట్లు పిచ్చాటూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం పిచ్చాటూరు బైపాస్‌రోడ్డు కూడలి వద్ద పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుండగా స్థానిక టీచర్స్ కాలనీకి చెందిన యుగంధర్, నింద్ర విజయ్, తుంబూరు రాజయ్య, అంబత్తూరుకు చెందిన యువరాజ్ మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడ్డారు. వీరిని పుత్తూరు కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున 40 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమించి మోసం చేసిన పంచాయతీ కార్యదర్శి అరెస్టు

వరదయ్యపాళెం, ఆగస్టు 5: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లి పంచాయతీ మిట్ట ఎస్సీకాలనీకి చెందిన పంచాయతీ కార్యదర్శి గిరిబాబుకు 2019లో ఓ యువతితో పరిచయం ఏర్పడింది. అది కాస్త ప్రేమగా మారింది. జూన్ 26న సూళ్లూరుపేట ఆలయంలో పెళ్లి నిర్ణయించగా అదేరోజు గిరిబాబు పరారయ్యాడు. దీంతో ఆ యువతి పోలీసులను ఆశ్రయించింది. గిరిబాబును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

సేవా దృక్పథం ఉన్న వారిని ఎస్ఎంసీ చైర్మన్‌గా ఎన్నుకోండి

పిచ్చాటూరు, ఆగస్టు 5: సేవా దృక్పథం ఉన్న వారిని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం పిచ్చాటూరులో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, కార్పొరేట్ స్థాయి వసతులు కల్పించేందుకు విద్యాశాఖ మంత్రి లోకేష్ చర్యలు చేపట్టారన్నారు. ఇందులో భాగంగా ఈ నెల 8న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలను నియమించడానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఎంఈవోలతో సమన్వయం చేసుకుని సేవా దృక్పథం, పాఠశాల అభివృద్ధికి అంకిత భావంతో పనిచేసే వారిని చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా, సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

అంధకారంలో వెలంపాళెం

శ్రీకాళహస్తి, ఆగస్టు 5: పట్టణంలోని వెలంపాళెం వీధిలో చీకటి పడితే అంధకారం అలుముకుంటోంది. పట్టణ నడిబొడ్డున ఉన్న వెలమపాళెం ద్విచక్ర వాహనాలు వెళ్లలేనంత చిన్న సందు. ఇలాంటి చోట నెల రోజుల క్రితం వీధి దీపాలు మరమ్మతులకు గురయ్యాయి. అప్పటి నుంచి రాత్రైతే వీధిలో పిల్లలు, మహిళలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పురపాలకసంఘ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. వెలంపాళెం ప్రాంతంలో గుంపులుగుంపులుగా వీధి కుక్కలు సంచరిస్తుంటాయి. వీధి దీపాలు వెలగకపోవడంతో కుక్కల బెడదతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు వణికిపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్‌లకు దరఖాస్తు చేసుకోండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 5: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్‌కు అడ్మిషన్ కోసం అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు రమణయ్య కోరారు. వివరాలకు 9502527708 ఫోన్ చేయాలని సూచించారు.

బలవంతపు మతమార్పిళ్లపై చర్యలు తీసుకోండి

ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ ధర్నా


ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

ఏర్పేడు, ఆగస్టు 5: బలవంతపు మతమార్పిళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ఎదుట బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాసులు నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఏర్పేడు మండలంలో బలవంతపు మతమార్పిళ్లు ఎక్కువయ్యాయని చెప్పారు. మతం మారాలంటూ హిందువులపై అన్యమతస్తుల దౌర్జన్యాలు చేయడం దారుణమన్నారు. వారి ఆగడాలు శృతి మించితే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మూడు రోజుల క్రితం ఏర్పేడు మండలంలో మునగలపాళెంలో పెమ్మసాని వెంకట్రామ నాయుడు కుటుంబ సభ్యులను క్రైస్తవ మతంలో చేరితే యేసు రక్షిస్తాడని, ప్రతి నెలా జీతం లాగా డబ్బులు వస్తాయని రేణిగుంట మండలానికి చెందిన కొంతమంది క్రిస్టియన్లు బలవంతం చేశారని తెలిపారు. వెంకట్రామ నాయుడు అంగీకరించకపోవడంతో దుర్భాషలాడి, అతనిపైనే అక్రమ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. అనంతరం సీఐ శ్రీరామ శ్రీనివాసులును కలిసి అన్యమతస్తులపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో జిల్లా స్థాయిలో ధర్నాలు ఆందోళన చేపడతామని స్పష్టం చేశారు. వెంకట్రామ నాయుడు మీద ఉన్న పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని కోలా ఆనంద్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, వరప్రసాద్, కొండేటి గోపాల్, పునగంటి భాస్కర్, జీపాళెం తేజోవతి, డిల్లీకుమార్, గునకల వెంకట సుబ్బయ్య, దాము రాయల్, ప్రసాద్, జీవీ అమర్‌నాథ్, సొట్ట సుకుమార్, రమేష్, మెండు బాలగురవయ్య, నరేష్, యుగంధర్, కోలే షణ్ముగం, విజయకుమార్, మణి, తానికొండ్ల భరత్, హరీష్, వినోద్, డిల్లీ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో సగం వ్యాధులు దూరం


చెత్త బుట్టలు అందజేస్తున్న సుమన్‌కుమార్

నారాయణవనం, ఆగస్టు 5: పరిసరాల శుభ్రతతో సగం వ్యాధులను దూరం చేయవచ్చని జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాల శుభ్రత తప్పనిసరి అని చెప్పారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త చెదారాలు వేయకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, సర్పంచు గణేష్, పంచాయతీ కార్యదర్శి షణ్ముగం, ఏపీవో సుకన్య, వెలుగు ఏపీఎం మమత, టీడీపీ నాయకులు భాస్కరన్, ఊరప్ప, శివకుమార్, మెయిద్దీన్, పీకే గణేష్, బాబుచిన్న, దొరైమునిబాబు, పురుషోత్తం, సురేష్, గాండ్ల నాగరాజు, సుధాబాబు, మురుగేశం తదితరులు పాల్గొన్నారు.

9నుంచి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం, ఆగస్టు 5: మండలంలో వెలసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 9నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. ఆగస్టు 9న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. 14వ తేదీ రాత్రి 7.30గంటల నుంచి 9 గంటల వరకు కల్యాణోత్సవం నిర్వహిస్తారు. గృహస్తులు(ఇద్దరు) రూ.500 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొనవచ్చు. 17వ తేదీ రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిస్తాయని అధికారులు పేర్కొన్నారు. కాగా, టీటీడీ హిందూ ధర్మ ప్రచారా పరిషత్ ఆధ్వర్యంలో సాయంత్రం హరికథలు, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తారు.

విద్యార్థులకు నగదు బహుమతులు


విద్యార్థికి నగదు బహుమతి అందజేస్తున్న జాకీర్ హుస్సేన్

పిచ్చాటూరు, ఆగస్టు 5: పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన పిచ్చాటూరు జడ్పీ హైస్కూలోని ఇద్దరు విద్యార్థులకు ఇదే పాఠశాలలో పూర్వ విద్యార్థి జాకీర్ హుస్సేన్ రూ.4 వేల చొప్పున నగదు బహుమతులు అందించారు. పిచ్చాటూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి సోమశేఖర్(579) మార్కులతో మండల టాపర్‌గా నిలవగా, మరో విద్యార్థి మదన్ (560) మార్కులతో పాఠశాల ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరిద్దరికీ రూ.5 వేలు చొప్పున మొత్తం రూ.10 వేలు జాకీర్ హుస్సేన్ అందించారు. ఇకపై ఏటా పాఠశాలలో ఎక్కువ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తానని జాకీర్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గిరి ప్రకాష్, పూర్వ విద్యార్థులు రియాజ్, కిరణకరణ్ తదితరులు పాల్గొన్నారు.

కీళపూడి సచివాలయంలో తనిఖీలు

పిచ్చాటూరు, ఆగస్టు 5: మండలంలోని కీళపూడి గ్రామ సచివాలయాన్ని తహసీల్దార్ రమేష్‌బాబు సోమవారం తనిఖీ నిర్వహించారు. ఉద్యోగుల హాజరు వివరాలపై ఆరా తీశారు. కచ్చితంగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. గ్రామాల్లో శాంతభద్రతల సమ స్యలు ఉంటే ఎప్పటి కప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్ రమేష్‌బాబు

గాజులమండ్యంలో స్టిక్కర్ల దందా

రేణిగుంట, ఆగస్టు 5: మండల పరిధిలోని గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ ముందు ఓ ముఠా వాహనాలకు స్టిక్కర్ల పేరుతో దందా సాగిస్తోంది. ఇటీవల అర్ధరాత్రి పలమనేరుకు చెందిన ఓ లారీ సరుకుతో వెళుతుండగా ఉత్తరాదికి చెందిన ఓ ముఠా కొత్త స్టిక్కర్లు అతికించుకోవాలని, ఇందుకోసం రూ.300 ఇవ్వాలని డిమాండ్ చేసింది. ప్రశ్నించిన లారీ డ్రైవర్‌పై ముఠా సభ్యులు దౌర్జన్యానికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న పోలీసులకు చెప్పగా వారు కూడా ముఠా సభ్యులకే వత్తాసు పలికినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. వారం రోజు లుగా ఈ దందా సాగుతుండడం, పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం పట్ల వాహనదారుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై గాజుల మండ్యం సీఐ సుబ్బరాయుడును వివరణ కోరగా ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టామని, ఇందులో ఎలాంటి బలవంతం లేదని చెప్పడం గమనార్హం.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ


విజేతలతో ముఖ్య అతిథులు, టీచర్లు

తిరుపతి(విద్య), ఆగస్టు 5: పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమని నారాయణ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు చిట్టిబాబు చెప్పారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేలా 'పరివర్తన్ ప్రభావ్' పేరుతో ఇంటర్ స్కూల్ కాంపిటీషన్స్ కరకంబాడి అమర రాజా విద్యాలయంలో సోమవారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన చిట్టిబాబు మాట్లాడుతూ.. మన సౌకర్యాలకోసం ప్రకృతిని నాశనం చేయకూడదని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అమర రాజా సంస్థల ఐటీ హెడ్ కె.కృష్ణ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 12 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరరాజా మొబిలిటీ సీనియర్ మేనేజర్ బాలసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు గ్లోరీ దేవప్రియ, టీచర్లు పాల్గొన్నారు.

తొట్టంబేడు తహసీల్దారుగా మధుసూదనరావు



శ్రీకాళహస్తి, ఆగస్టు 5: తొట్టంబేడు తహసీల్దారుగా మధుసూదనరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బద్వేల్ నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. సోమవారం ఆయన ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం తొట్టంబేడుకు చేరుకుని బాధ్యతలు స్వీకరించారు.

బీఎన్‌కండ్రిగ తహసీల్దారుగా సుబ్రహ్మణ్యం



బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 5: బుచ్చినాయుడుకండ్రిగ తహసీల్దారుగా సుబ్రహ్మణ్యం సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దారు కడప జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన తహసీల్దారుకు డీటీ చంద్రబాబు నాయుడు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

వరదయ్యపాళెం తహసీల్దారుగా రాజశేఖర్



వరదయ్యపాళెం, ఆగస్టు 5: వరదయ్యపాళెం తహసీల్దారుగా పి.రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వీఆర్వోలు, వీఆర్ఏలతో సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

కేవీబీపురం తహసీల్దారుగా దస్తగిరయ్య

కేవీబీపురం, ఆగస్టు 5: కేవీబీపురం తహసీల్దారుగా దస్తగిరయ్య నియమితులయ్యారు. సోమవారం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలాన్ని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు.

పుత్తూరు వార్తలు

బిడ్డకు ముర్రుపాలే మొదటి టీకా


తల్లిపాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పుత్తూరు, ఆగస్టు 5: బిడ్డకు ముర్రుపాలే మొదటి టీకా అని పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పద్మజ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం, గోపాలకృష్ణాపురం, గట్టు, గేట్‌పుత్తూరులోని స్వయంసహాయక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తప్పనిసరిగా ఆరునెలల పాటు తల్లి పాలను ఇవ్వడం వల్ల తల్లికి బ్రెస్ట్ కాన్సర్ ముప్పు తప్పుతుందన్నారు. ముర్రుపాలు బదులు చక్కెర నీళ్లు, తేనె ఇవ్వడం సరికాదన్నారు. ఈ కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు గీతాంజలి, సంధ్య, సంఘమిత్రలు, అంగన్వాడీ టీచర్లు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

అమూల్ పాల సేకరణను రద్దు చేయొద్దు

పుత్తూరు టౌన్, ఆగస్టు 5: అమూల్ పాల సేకరణ ప్రక్రియను రద్దు చేయొద్దని పాలు సేకరణ సంఘాల కార్యదర్శులు, రైతులు డిమాండ్ చేశారు. పుత్తూరు, వడమాలపేటకు చెందిన పాడి రైతులు సోమవారం తిరుపతిలోని కలెక్టరేట్ వద్ద ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అమూల్ పాల సేకరణ ద్వారా ఆదాయం పొందుతున్నామని తెలిపారు. ఈనెల 20వ తేదీ నుంచి అమూల్ పాల సేకరణను రద్దు చేస్తున్నారని, అయితే పాలను ప్రైవేటు డెయిరీలు తీసుకోవడం లేదని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి: భానుప్రకాష్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు టౌన్, ఆగస్టు 5: ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. సోమవారం పుత్తూరులో జరిగిన జిల్లా స్థాయి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగుల తమ సమస్యలను ఏకరవు పెట్టారు. గత ప్రభుత్వంలోని నాయకులు, అధికారులు సచివాలయ సిబ్బందిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకొచ్చి, ఇబ్బందులకు గురిచేశారని వివరించారు. సచివాలయాల్లో కనీస వసతులు కల్పించలేదని వాపోయారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల సమస్య లను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. గత రెండు నెలల్లో ఒకేరోజు 98శాతం పించన్లు పంపిణీ చేసిన సచివాలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి, లబ్ధిదారులకు చేరవేయడంలో సచివాలయ సిబ్బంది కీలకమని అన్నారు. త్వరలో మెగా డీఎస్సీ, పోలీస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం వెలువరిస్తుందని తెలిపారు. అనంతరం సచివాలయ సిబ్బంది ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాదవయ్య, పట్టణ అధ్యక్షుడు జీవరత్నంనాయుడు, కార్యదర్శులు ఎంఎం ధనపాల్, డీజీ ధనపాల్, నాయకులు యుగంధర్, అంకయ్య, ఆనంద్, బాబునాయుడు, వెంకటేష్, జనసేన నేత మహేష్, సీపీఐ నాయకులు మహేష్, మురళి, రమేష్‌నాయుడు, మణిరెడ్డి, అంబేడ్కర్ ట్రస్ట్ కార్యదర్శి కుప్పయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యం


పాడి రైతులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

వడమాలపేట, ఆగస్టు 5: పాడి పరిశ్రమకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చెప్పారు. సోమవారం వడమాలపేట మండలం టీసీ అగ్రహారంలో గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువుల సంరక్షణ కోసం మారుమూల గ్రామాల్లో మినీ గోకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పాడి రైతులకు బరోసానిచ్చేలా బీమా పథకాన్ని పునరిద్దురించనున్నట్లు తెలిపారు. శిబిరంలో 62 పశువులకు గర్భకోశ చికిత్స నిర్వహించారు. పేయి దూడల ప్రదర్శనలో బలిష్టంగా ఉన్న మూడు దూడల మహిళా రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ ఉపసంచాలకుడు బాలసుబ్రహ్మణ్యం, సహాయ సంచాలకుడు గురునాథ్, పశు వైద్యాధికారులు మురళీధర రెడ్డి, సుజాత, సుబ్బారావు, చిరంజీవి, లోకనాథం, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, నాయకులు జానా వెంకటయ్య, రవిరెడ్డి, దాము, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.